ముంపు తప్పదా?

- వర్షాకాలంలో ఏటా మునుగుతున్న కాలనీలు
- అనుమతిలేని వెంచర్లు, నిర్మాణాలతోనే అంటున్న ప్రజలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



మాసబ్‌చెరువు అలుగు పారడంతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లవైపు ప్రవహిస్తున్న వరద నీరు (ఫైల్)

తుర్కయంజాల్: వర్షాకాలం వచ్చిందంటే చాలు పుర పాలక సంఘం పరిధిలో ముంపు ముంగిట ఉన్న కాలనీల ప్రజల ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. మూడేళ్లుగా ప్రతి ఏటా భారీ వర్షాలు కురుస్తుండటంతో ముంపు తప్పడం లేదు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో ఈ ఏడాది కూడా భారీ వర్షాలు కురిస్తే కాలనీలకు ముంపుగండం పొంచిఉంది.

అక్రమ నిర్మాణాలే ప్రధాన కారణం

గ్రామ పంచాయతీ అనుమతులతో చెరువులు, కుంటలు, కాలువలను కబ్జా చేసి ఇష్టానుసారంగా వెంచర్లు ఏర్పాటు చేయడమే నివాసాల ముంపునకు ప్రధాన కారణం. చెరువులు, కుంటలు, కాలువలు కళ్ల ముందే అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకోని పాలకులు, అధికారులే దీనికి బాధ్యులను చేయక తప్పదు. మాసబ్ చెరువు నుంచి దిలావర్‌ఖాన్ చెరువుకు నీరు వెళ్లే వాగు ఆపిల్ అవెన్యూ కాలనీ వద్ద కుంచించుకుపోవడంతో ప్రతి ఏటా చెరువు అలుగు పొంగినన్ని రోజులు ఆ కాలనీవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నీటితోనే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు మునుగుతున్నాయి. రెండు వైపులా గోడను నిర్మిస్తూ నాలా నిర్మాణం చేపడుతామని గతంలో అధికారులు ప్రకటించినా నేటికీ నెరవేరలేదు. అదే విధంగా మాసబ్ చెరువు నుంచి బాతుల చెరువుకు నీరు వెళ్లే కాలువ చాలాచోట్ల అన్యాక్రాంతమైంది. కాలువను పూడ్చి గోదాములు నిర్మించినట్లు ఇరిగేషన్ అధికారులు నివేదిక ఇచ్చినా నేటికి ఎలాంటి చర్యలు లేవు. ఫలితంగా ఈ నీరు సులువుగా ప్రవహించకపోవడంతో ఇంజాపూర్‌లోని హరిజనవాడ ముంపునకు గురవుతోంది.

ముంపునకు గురవుతున్న కాలనీలు

మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడలోని అరుంధతి కాలనీ, సిరి టౌన్‌షిప్, సామ లక్ష్మారెడ్డి నగర్, జీవీఆర్ కాలనీ, దుర్గాంజనాద్రి కాలనీ, గణేష్‌నగర్, ఓంగణేష్‌నగర్, సూరజ్‌నగర్ కాలనీ, తుర్కయంజాల్‌లోని ఆదిత్యానగర్, ఇంజాపూర్‌లోని ఆపిల్ అవెన్యూ, ఇందిరమ్మ కాలనీ, బ్రాహ్మణపల్లిలో చెరువు కట్ట కింద ఉన్నటువంటి బాలాజీ కాలనీ, కమ్మగూడలోని ఇందిరమ్మ కాలనీ, లక్ష్మీనగర్, సుందరయ్య కాలనీవాసులకు ముంపు తప్పడం లేదు.

రికార్డుల్లో కాలువ లేదనే సాకుతో..

మన్నెగూడలోని ఎర్రకుంట నిండితే నీరు కిందకు పోవడానికి కాలువ లేదు. దీంతో ఆ నీరంతా కుంట వెనుక వైపు ఉన్న అరుంధతి కాలనీ, సిరి టౌన్‌షిప్‌ను ముంచెత్తుతుంది. తూము ద్వారా బయటకు వచ్చిన నీరు గొలుసుకట్టు కాలువల ద్వారా కిందన ఉన్నటువంటి గంగరాయి చెరువులోకి వెళ్లాలి. కానీ రికార్డుల ప్రకారం కాలువ లేదు అన్న కారణంతో యథేచ్ఛగా వెంచర్లు, నిర్మాణాలు చేపడుతున్న అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

> **ముంపు నివారణ చర్యలు తీసుకుంటాం**
>
> 
>
> వర్షాకాలంను దృష్టిలో ఉంచుకుని అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నాం. నాలాల, మురుగునీటి కాలువల పూడికతీత పనులను ఇప్పటికే ప్రారంభించాం. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. వర్షాలు పడే సమయంలో 24/7 ఫోన్ నంబర్లు అందుబాటులోకి తెస్తాం. డిజాస్టర్ మేనేజిమెంట్ టీమ్ ఏర్పాటు చేస్తాం. ప్రజలు ఆందోళన చెందొద్దు. ముంపు నివారణ చర్యలు తీసుకుటాం.
>
> – సాబేర్ అలీ, కమిషనర్, తుర్కయంజాల్ మున్సిపాలిటీ

సబర్బన్ సర్వీసులు నడపండి

ఎమ్మెల్యేకు జైపాల్‌యాదవ్‌కు కడ్తాల్ సర్పంచ్ వినతి

కడ్తాల్: మండల కేంద్రం నుంచి హైదరాబాద్ వరకు ఆర్టీసీ సబర్బన్ సర్వీస్‌లు నడిపించాలని కడ్తాల్ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి బుధవారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం జిల్లా బస్సుల ద్వారా ప్రయాణిస్తుండటంతో జిల్లా బస్‌పాస్ సౌకర్యానికి అధిక మొత్తంలో డబ్బులు వెచ్చించాల్సి వస్తోందని దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం కందుకూర్ మండల కేంద్రం వరకు ఆర్టీసీ సబర్బన్ సేవలు అందుతున్నాయని.. వాటిని కడ్తాల్ వరకు పొడగించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌తో ఫోన్లో మాట్లాడి కడ్తాల్ మండల కేంద్రానికి సబర్బన్ సర్వీస్‌లు నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

నిధులు మంజూరు చేయండి

అదేవిధంగా మండల కేంద్రంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా.. 2, 3, 12 వార్డులను కలిపే విధంగా నూతనంగా మరో లక్ష లీటర్ల నీటి ట్యాంకు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు మండల అధ్యక్షుడు వీరయ్య, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు పత్యానాయక్, మర్రిపల్లి సర్పంచ్ జంగయ్య, బాలాజీనగర్ సర్పంచ్ బీచ్యానాయక్, నాయకులు రాజేందర్‌యాదవ్, అశోక్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, గ్రామస్తులు

హైకోర్టు తీర్పు హర్షణీయం

రైతుసంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి

యాచారం: నందివనపర్తి ఓంకారేశ్వరాలయ భూములు సాగులో ఉన్న రైతులకే చెందాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ... ఆలయ భూములను టీఎస్ఐఐసీ ఫార్మాసిటీకి ఎలా తీసుకుంటారని హైకోర్టు స్టే విధించడం హర్షణీయమని అన్నారు. ఓంకారేశ్వరాలయానికి చెందిన 1,400 ఎకరాల భూమిలో నందివనపర్తి, నస్దిక్‌సింగారం, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన 500 మందికి పైగా రైతులు సాగు చేసుకుని ఏళ్లుగా జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. అలాంటి రైతుల నుంచి టీఎస్ఐఐసీ బలవంతంగా భూములు తీసుకుని ఫార్మాసిటీకి ఇవ్వడం సరైంది కాదని అన్నారు. ఓంకారేశ్వలయానికి చెందిన భూములపై సాగులో ఉన్న రైతులకే పట్టాదారు, పాసుపుస్తకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. రైతులకు మద్దతుగా పోరాటం చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, నాయకులు రాములు, జంగయ్య, బుగ్గరాములు, సురేష్, సంజీవ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వివాహ ధ్రువీకరణ పత్రం కావాలా?



వధూవరులతో మొక్కలు నాటించి వివాహ ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న సర్పంచ్

- వధూవరులు రెండు మొక్కలు నాటాల్సిందే
- వినూత్న కార్యక్రమానికి ఏడాది పూర్తి
- ఆదర్శంగా నిలుస్తున్న సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: నూతనంగా వివాహం చేసుకున్న వధూవరులకు వివాహ ధ్రువీకరణ పత్రాల కోసం గ్రామ పంచాయతీ కార్యాలయాలకు రావడం వారికి ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు వివాహ ధృవీకరణ పత్రాలు అందజేయడం అన్ని గ్రామాల్లో జరిగేదే.. దీనికి భిన్నంగా కడ్తాల్ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి వినూత్నంగా ఆలోచించారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలనే ఆలోచనతో.. వివాహ ధ్రువీకరణ పత్రాల కోసం గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చే నూతన వధూవరులకు విధిగా రెండు మొక్కలు నాటితేనే వారికి సంబంధిత పత్రం ఇస్తామంటూ షరతు పెట్టారు. ఈ కార్యక్రమానికి ప్రశంసలతో పాటు అనూహ్యమైన స్పందన రావడం జరిగింది. గ్రామ పంచాయతీ పరిధిలో వివాహం జరిగిన దంపతుల చేత స్థానిక పల్లె ప్రకృతివనం, అనువైన స్థలాలో మొక్కలు నాటిస్తూ వారికి ధ్రువీకరణ పత్రాలు అందచేస్తూ వస్తున్న సర్పంచ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి నేటికి ఏడాది పూర్తయ్యింది. ఈ మేరకు బుధవారం నూతన వధూవరులు అశ్విని–సురేశ్, కావేరి శివకిరణ్ చేత స్థానిక పల్లెప్రకృతి వనంలో మొక్కలు నాటించి వారికి వివాహ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఏడాది కాలంగా పంచాయతీ పరిధిలో 100 మంది వధూవరుల చేత మొక్కలు నాటించి వారికి వివాహ ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఏడాదిగా పర్యావరణ పరిరక్షణకు సహకరించిన వధూవరులకు, సహకరించిన గ్రామ ప్రజలకు, పాలకమండలి సభ్యులకు సర్పంచ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాఘవేందర్, వార్డు సభ్యులు గణేశ్, నాయకులు యాదయ్య,ముత్తికృష్ణ, వెంకటేశ్,రాములు, జంగయ్య, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న ఎంపీ రాములు

ఆమనగల్లు: ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు సహకారంతో మాడ్గుల మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్‌కు రూ.36 వేలు, తిరుపతికి రూ.18 వేలు మంజూరయ్యాయి. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేటలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎంపీ రాములు లబ్ధిదారులకు సంబంధిత సీఎంఆర్ ఎఫ్ చెక్కులను అందజేశారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న నేతలు

తుర్కయంజాల్: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దయానంద్‌గౌడ్, వనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్ అన్నారు. ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా బుధవారం పురపాలక సంఘం పరిధిలోని ఇంజాపూర్‌లో వారు పర్యటించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అర్జున్‌రెడ్డి, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, నాయకులు పురుషోత్తం, కార్తీక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు పాఠ్యపుస్తకాల విక్రయం

పుస్తకాల గదిని సీజ్ చేసిన అధికారులు

ఆమనగల్లు: విద్యార్థులకు అధిక ధరలకు పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలియడంతో బుధవారం ఏబీవీపీ నాయకులు పాఠశాలను సందర్శించారు. అదే సమయంలో పాఠశాలలోని ఓ గదిలో పుస్తకాలను విక్రయిస్తుండటంతో వెంటనే ఏబీవీపీ నాయకులు మండల విద్యాధికారి సర్దార్‌నాయక్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రైవేటు పాఠశాలను సీఆర్‌పీ షేక్ అహ్మద్ తనిఖీ చేసి పాఠశాలలో విక్రయిస్తున్న పుస్తకాలు ఉన్న గదిని సీజ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు భరత్, మల్లేశ్, అంజి, శివ, సుమన్‌నాయక్, శివగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ భవన నిర్మాణ పనులు షురూ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పాత బస్టాండ్ వద్ద సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి సంబంధించిన భూమిచదును చేసే పనులను బుధవారం ప్రారంభించారు. ఫిబ్రవరి 2022లో మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి ఈ పనులు ముందుకు సాగలేదు. భవన నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యంపై ‘సాక్షి’లో ఇటీవల ప్రత్యేక కథనం వచ్చింది. దీనికి స్పందించిన స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఈ భవన నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించారు. నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించి పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం భూమి చదను చేసే పనులు ప్రారంభం అయ్యాయి. పనులు ప్రారంభం కావడంతో పాత ఇబ్రహీంపట్నం వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా పాత బస్టాండ్ వద్ద ఉన్న పురాతన గోదాంలను తొలగించి ఆ స్థలాన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఏర్పాటుకు కేటాయించిన సంగతి తెలిసిందే.

విధి నిర్వహణలో బదిలీలు సహజం: సీఐ



నర్సింహులు, రవీందర్‌ను సన్మానించిన నాయకులు

తలకొండపల్లి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ నర్సింహులు శెట్టి, హెడ్ కానిస్టేబుల్ రవీందర్ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బుధవారం పీఎస్‌లో వారికి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, మండల జర్నలిస్టులు, నాయకులు, అధికారులు వారిని ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో బదిలీలు సహజమని.. మనం చేసిన మంచి పనులే సమాజంలో గుర్తింపునిస్తాయని సీఐ ఉపేందర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు సుందరయ్య, వెంకటేశ్‌యాదవ్, సర్పంచ్‌లు శ్రీశైలం, జ్యోతయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలు

ట్రైనీ డీఎస్పీ సింధూప్రియ



సమావేశంలో మాట్లాడుతున్న సింధూప్రియ

కడ్తాల్: పట్టుదల, క్రమశిక్షణతో చదివి విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ట్రైనీ డీఎస్పీ పెనరు సింధూప్రియ అన్నారు. మండల పరిధిలోని ముద్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థుల భవిష్యత్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సింధూప్రియ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం కూడ ముఖ్యమని సూచించారు. నేడు పురుషులతో సమానంగా స్త్రీలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని.. స్త్రీ, పురుష బేధం లేకుండా బాలికలను ఉన్నత చదువులు చదివించాలని అన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి జీవితంలో అత్యున్నత స్థానానికి చేరుకోవాలని సూచించారు. అనంతరం ముద్విన్ గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి సాయికుమార్ మాట్లాడుతూ.. డీఎస్పీ సింధూప్రియను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ముందుకుసాగాలని కోరారు. ఈమేరకు ముద్విన్ పాఠశాలలో చదివి ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఎంసెట్ తదితర పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు, ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. లక్ష్యసాధన దిశగా సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నర్సింహ, మాజీ సర్పంచ్ యాదయ్య, సాయికుమార్, పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌రావు, పీఈటీ భీముడు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోండి

తుర్కయంజాల్: జూన్ 15వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ అయి ఉండి రైతుబంధు రానటువంటి రైతులందరూ రైతుబంధు కొరకు దరఖాస్తు చేసుకోవాలని అబ్దుల్లాపూర్‌మెట్ మండల రైతు బంధు కన్వీనర్ బలదేవ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందించాలని సూచించారు.

మాల్‌లో వాహనాల తనిఖీ

యాచారం: బక్రీద్ పండుగ సందర్భంగా సాగర్ రోడ్డుపై మాల్ కేంద్రంలో బుధవారం సాయంత్రం యాచారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో సాగర్‌రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనాల్లో పశువుల తరలింపుపై నిఘా పెట్టారు. ప్రతి వాహనాన్ని తనిఖీ నిర్వహించి అతివేగంగా వెళ్తున్న వారిని హెచ్చరించి వదిలి పెట్టారు.

భూ సమస్యలు పరిష్కరించండి: సీపీఎం

యాచారం: మండలంలోని పలు గ్రామాల్లో అనేక భూసమస్యలు ఉన్నాయని.. మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నా పరిష్కారాం కావడం లేదని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ అన్నారు. తహసీల్దార్ సుచరితను కలిసి బుధవారం పలు గ్రామాల్లో ఉన్న భూ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ధరణి పోర్టల్‌తో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వ్యవసాయ పనులు వదిలేసి రైతులు నిత్యం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. గ్రామాల్లో వెంటనే స్పెషల్‌డ్రైవ్ చేపట్టి రైతుల భూ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఘనంగా పీవీ జయంతి వేడుకలు



పీవీ నర్సింహారావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తుర్కయంజాల్: భారత మాజీ ప్రధాని, దివగంత నేత పి.వి.నర్సింహారావు జయంతి వేడుకలను తుర్కయంజాల్‌లో మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పీవీ చిత్రపటానికి నివాళులర్పించారు. దేశానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఆయన పీఎంగా ఉన్నప్పుడు చేపట్టిన ఆర్థిక సంస్కరణలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటేష్, శివకుమార్, మధుసూధన్ రెడ్డి, కౌన్సిలర్లు ఐలయ్య, సునీల్, నాయకులు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హరితాహారానికి సర్వం సిద్ధం

- మండలంలో ఈ ఏడాది నాటనున్న లక్షాఇరవై వేల మొక్కలు
- శరవేగంగా గుంతలు తీసే పనులు



మంచాల నర్సరీలో సిద్ధంగా మొక్కలు

మంచాల: హరితాహారంలో భాగంగా గ్రామాల్లో మొక్కలు నాటడానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా మొక్కలు నాటేందుకు 10వేల గోతులు తీశారు. మంచాల మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు సంబంధించిన నర్సరీల్లో లక్షా యాభైవేల మొక్కలు హరిహారానికి సిద్ధంగా ఉన్నాయి. మండల వ్యాప్తంగా లక్షా 20వేలు మొక్కలు నాటాలి. అందుకోసం గ్రామాల్లో గోతులు కూడా తీస్తున్నారు. ఇప్పటికే 10వేల గోతులు తీశారు. ఒకటి–రెండు భారీ వర్షాలు కురవగానే మొక్కలు నాటే కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించనున్నారు.

ఎటుచూసినా పచ్చదనమే..

గత హరితాహారాల్లో భాగంగా నాటిన మొక్కలతో గ్రామాల్లో ఎటుచూసిన పచ్చదనం వెల్లివిరుస్తోంది. ప్రభుత్వ భవన కార్యాలయాల వద్ద, పాఠశాలల్లో, రోడ్లకు ఇరువైపులా మొక్కలు పెంచారు. మంచాల మండలంలో 2020–21 సంవత్సరానికి 2,42,958 మొక్కలు నాటగా వాటిలో 92 శాతం మొక్కలు బతికాయి. 2021–22 సంవత్సరానికిగ గాను 41,375 మొక్కలు నాటగా వాటిలో 95శాతం మొక్కలు బతికాయి. దీంతో ఎటుచూసిన పచ్చదనం కన్పిస్తోంది.

> **ప్రజలందరూ భాగస్వాములు కావాలి**
>
> 
>
> ఒకటి–రెండు భారీ వర్షాలు కురవగానే వెంటనే మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం. గ్రామాల్లో మొక్కలు నాటడానికి గోతులు కూడా తీయిస్తున్నాం. మిగితా పనులు వేగవంతంగా చేయిస్తున్నాం. ప్రజలందరూ హరితహారంలో భాగస్వాములు కావాలి.
>
> – శ్రీనివాస్, ఎంపీడీఓ, మంచాల

ఈ ఏడాది కూడా పెద్ద సంఖ్యలో మొక్కలు నాటేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

మండల ఏర్పాటుకు గ్రామస్తుల బైక్ ర్యాలీ

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ గ్రామస్తులు, నాయకులు బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. వెంకట్రావ్‌పేట్, గడ్డమీదితండా, మెదక్‌పల్లి తదితర గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. మండల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాడుతామన్నారు. వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, రేణురెడ్డి, డేవిడ్, రఘురాములు, బాలస్వామి, రాజు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సామర్థ్యాల పెంపే లక్ష్యంగా..

- వాయిస్ ఫర్ గర్ల్స్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ
- జిల్లాలోని ఆరు గురుకులాల నుంచి ఎంపిక
- నల్లకంచె గురుకులంలో కొనసాగుతున్న క్యాంప్



వాయిస్ ఫర్ గర్ల్స్ (వీఫోర్‌జీ) ఆకారంలో విద్యార్థినుల ప్రదర్శన



ప్రముఖుల ఫొటోలతో చార్ట్స్ ప్రిపేర్ చేసిన విద్యార్థినులు

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బాలికల్లోని సృజనాత్మకతను, నాయకత్వ పటిమను, సామర్థ్యాన్ని వెలికితీసి వారిని చైతన్య మూర్తులుగా తీర్చిదిద్దేందుకు ‘వాయిస్ ఫర్ గర్ల్స్’ అనే స్వచ్ఛంద సంస్థ కృషిచేస్తుంది. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబాటుతనంతో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లల్లో ఉంటూ చదువుకునే బాలికలు (విద్యార్థినులు)వేల సంఖ్యలో ఉన్నారు. అలాంటి వారిలో చైతన్యం, నైపుణ్యాలను అభివృద్ధి చేయడంతో పాటు మానసిక ధృడత్వం పెంచేలా వాయిస్ ఫర్ గర్ల్స్ స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తుంది.

124 మందికి శిక్షణ..

ఇబ్రహీంపట్నం, ఆర్కేపురం, సరూర్‌నగర్, మహేంద్రహిల్స్, నార్సింగి, శంకర్‌పల్లిల్లో గల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదివే 124 మంది విద్యార్థినులకు స్థానిక నల్లకంచెలోని బాలిక గురుకుల పాఠశాలలో ఈనెల 20వ తేదీ నుంచి ఈ ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ప్రముఖుల చరిత్ర, నేటి సమాజ పోకడలు, రాజకీయ అంశాలు, ఆంగ్లంపై పట్టు, ఆటలు, పాటలు, వ్యాసరచన, డ్రాయింగ్, ఏకాగ్రత సాధన, ఉపన్యాసాలపై ప్రత్యేక శిక్షణను పొందుతున్నారు. ఫీల్డ్ కోఆర్డినేటర్ ఎస్.శ్వేత ఎప్పటికప్పుడు ఈ శిక్షణను పర్యవేక్షిస్తుండగా.. కౌన్సెలర్లుగా తన్వీ, సుప్రియా, కరీనా వ్యవహరిస్తూ విద్యార్థులకు మంచి తర్ఫీదును ఇస్తున్నారు. ఈ శిక్షణతో ఎలాంటి కఠిన సమస్యలనైనా ఎదుర్కుంటామనే మనోధైర్యం బాలికల్లో స్పష్టంగా కనిపిస్తోందంటున్నారు శిక్షకులు. పాఠశాలలో ఈనెల 30న నిర్వహించే ముగింపు కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరౌతున్నట్లు సమాచారం.

> **నైపుణ్యాలు మెరుగుపడతాయి**
>
> జీవితంలో ఉన్నతస్థాయికి ఎదిగేందుకు ఈ శిక్షణ ఎంతో తోడ్పాటునందిస్తుంది. కౌమారదశలో ఈ శిక్షణను పొందడంతో విద్యార్థినుల్లోని సృజనాత్మకత, నైపుణ్యాభివృద్ధి వెలికి వస్తుంది. వారి జీవన ప్రయాణాన్ని తెలియజేస్తుంది. వారితో జ్ఞానాన్ని పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉంది.
>
> – శ్వేత, ఫీల్డ్ కోఆర్డినేటర్

> **స్నేహితులతో పంచుకుంటా**
>
> 
>
> ఈ శిక్షణతో నాలో ఎంతో మార్పు వచ్చింది. ధృడ సంకల్పంతో ఏదైనా సాధించగలననే నమ్మకం ఏర్పడింది. ఆరోగ్యం, భద్రత, హక్కులు, నాయకత్వ లక్షణాలు ఎలా ఉంటాయో తెలిసింది. ఇక్కడ నేర్చుకున్న విషయాలను నా కుటుంబం, స్నేహితులతో పంచుకుంటాను. ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు.
>
> – నవనీత, 8వ తరగతి, నార్సింగి గురుకుల పాఠశాల

> **నాయకత్వ లక్షణాలు నేర్చుకున్నా**
>
> 
>
> ఏదైనా సమస్య వస్తే సంఘర్షణకు తావులేకుండా మర్యాదపూర్వకంగా ఎలా పరిష్కరించుకోవచ్చో తెలిసింది. మార్గదర్శకులు కావాలంటే నాయకత్వ లక్షణాలు ఎంతో ముఖ్యం. శిక్షణలో ఎన్నో విషయాలు నేర్చుకున్నాం. ఇక్కడి ఉపాధ్యాలయులు అందించిన శిక్షణ భవిష్యత్తులో నా ఉన్నతికి తోడ్పడుతుంది. తోటి స్నేహితులతో ఇక్కడి విషయాలను పంచుకుంటాను.
>
> – శర్వాణి, 8వ తరగతి, మహేంద్రహిల్స్ గురుకుల పాఠశాల